

# సాహితీమూర్తుల సహవాసం

## – నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

# నేను రాసిన పత్రికలు - నాకు తెలిసిన ఎడిటర్స్

## 7


SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD. VIJAYAWADA AND TIRUPATHI

ఉదయం

చీఫ్ ఎడిటర్: దాసరి నారాయణరావు

# ఉదయం - దాసరి నారాయణరావు

సుప్రసిద్ధ సినీ డైరెక్టర్ దాసరి నారాయణరావు 1984లో హైదరాబాదు నుండి ‘ఉదయం’ దినపత్రిక పెట్టారు. దానికి ఎడిటర్లుగా ఎ.బి.కె. ప్రసాద్, కొండముది రామచంద్రమూర్తి, గజ్జెల మల్లారెడ్డి ఉన్నారు. సిబ్బందిలో దేవీప్రియ కూడా ఉండేవారు. కొన్నాళ్ళు పురాణ సుబ్రహ్మణ్య శర్మ కూడా పనిచేశారు. ఆరేళ్ళపాటు సాగిన ఈ పత్రిక యాజమాన్యం మారి, క్రమేణా ఆగిపోయింది. కాకరాల తులసీదాసు


గజ్జెల మల్లారెడ్డి

ఆఫీసు యాజమాన్యం పనులు పర్యవేక్షిస్తుండేవారు. ఆర్థికపరంగా పత్రికలు ఎప్పుడూ ఇబ్బందులను ఎదుర్కొంటుండేవి. ఏరోజుకారోజు పత్రిక అచ్చు వేయడానికి కావలసిన పేపరు కోసం వెతుక్కునేవారు. అలాంటి ఇబ్బందులతోనే మొత్తం మీద కొన్ని రోజులు నడపగలిగారు.

'ఉదయం'లో నేను రాసిన వ్యాసాలు కొన్ని ఉన్నప్పటికీ ముఖ్యంగా మూడు వ్యాసాలు సంచలనాత్మకంగా వివాదాలకు దారితీసాయి. అందులో ప్రప్రథమంగా పేర్కొనదగినది వివేకానందపై నా వ్యాసం. ఎబికె ప్రసాద్ ఎడిటర్ గా నా వ్యాసాన్ని, ఎడిటోరియల్ పేజీలో ప్రముఖంగా ప్రచురిస్తూ "మనకు తెలిసిన వివేకానంద వేరా" అని హెడ్డింగ్ పెట్టారు. అందులో సంపాదకుడి నోట్ రాస్తూ దీనిపై భిన్నాభిప్రాయాలు ఎవరైనా వెల్లడిస్తే ప్రచురించటానికి అభ్యంతరం లేదని బాక్స్ పెట్టి వేశారు.

### వివేకానందపై వ్యాసం

ఆ వ్యాసంలో వివేకానంద బాగోగులు మంచి చెడులు పరిశోధనాత్మకంగా ఆధారాలతో రాయటం విశేషం. "వేదాంతం – భారత పునర్వికాసం" నిరంజన్ ధర్ పరిశోధనాత్మక గ్రంథం బెంగాల్ లో ప్రచురణ కాగా అందులో ఆధారాలున్న విషయాలను వ్యాసంలో చూపాము. వివేకానంద అమెరికా ప్రయాణం, జమీందార్ల డబ్బుతో ఆయన ఓడలో వెళ్ళి, విలాసంగా గడపటం, తిరిగి వచ్చిన తరవాత నరహంతకులైన జమీందార్లను రామనాడ్ రాజా, క్షత్రి రాజుల పాలనను సమర్థిస్తూ, వారి ప్రాంతాలలో పర్యటించి మద్దత్తు పలికారు. దీర్ఘాయుష్షుకు యోగా మంచిదని చిట్కా వైద్యంగా ప్రచారం చేసిన వివేకానంద 38 ఏళ్లకే చనిపోయాడు. ఇలాంటి వాస్తవాలతో కూడిన వ్యాసం చదివి గుడివాడ, కడప, రాజమండ్రి, హైదరాబాదు, విజయవాడ ప్రాంతాలలో తీవ్ర నిరసన ఆందోళన వెల్లడించారు. ఇది గమనించి ఎ.బి.కె ప్రసాద్ సంపాదకీయం రాస్తూ మొదట అనుసరించిన ధోరణికి భిన్నంగా వివేకానంద సూర్యుడి వంటి వాడని ఆయన వెలుగుకు చెయ్యి అడ్డం పెట్టజాలమని అర్థం వచ్చే రీతిలో రాశారు. హైదరాబాదులో భజరంగ్ దళ్, ఆర్.ఎస్.ఎస్. వారు లారీలతో ఉదయం ఆఫీసుపై దాడి చేశారు. అప్పుడు దాసరి నారాయణ రావు ధైర్యంగా నిలబడి తమ సిబ్బందినందరినీ ఎదురు దాడికి సంసిద్ధులు కమ్మని గేటు వద్దకు వచ్చారు. ఆయన ప్రదర్శకులతో మాట్లాడుతూ చేతనైతే సమాధానం చెప్పండి, పత్రికలో ప్రచురిస్తాం. అంతేగాని కర్రలు పట్టుకుంటే ఆపని తామూ చేయగలమని సవాలు విసిరారు. అంతటితో ప్రదర్శకులు వెళ్ళిపోయారు. వ్యాసానికి సమాధానం మాత్రం ఎవరూ రాయలేదు.


ఎ.బి.కె.ప్రసాద్


దాసరి

త్రిపురనేని రామస్వామి మొదట్లో తన పేరుకు చౌదరి అని చేర్చినా చివరిలో ...భగవద్గీత... రచన చేసేనాటికి చౌదరిని తొలగించారు. తెనాలిలో సూతాశ్రమం స్థాపించి అనేకమంది స్వసంఘ పురోహితులను తయారుచేయించారు. కేవలం బ్రాహ్మణులే కాక ఏ కులం వారైనా పౌరోహిత్యం జరపవచ్చునని ఉద్యమం చేశారు. అంతేకాక పెళ్ళి మంత్రాలు, ప్రమాణాలు పెళ్ళి చేసుకునేవారికి అర్థం కావాలని వారి మాతృభాషలో వాటిని చెప్పాలని ప్రచారం చేశారు. దీనిపై పెద్ద రియాక్షన్ వచ్చింది. కొంతమంది పురోహితులు శిక్షణ పొంది పెళ్ళిళ్ళు చేయించారు. అందులో కమ్మ కులస్థులు ఎక్కువగా వుండటం వలన కమ్మ పురోహితులు అనే నానుడి

కూడా వచ్చింది. ఇతర కులాల్లో చెదురు మదురుగా పురోహితులు వచ్చారు. ఇలాంటి ఉద్యమానికి రాజకీయ పార్టీలలో కూడా ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీలో మద్దతు లభించింది. మత ప్రసక్తి లేకుండా పెళ్ళి మంత్రాలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ, స్వాతంత్ర్యానంతరం ఆ ఉద్యమం ఉధృతి దగ్గిపోయింది. త్రిపురనేని రామస్వామి కుమారుడు గోపీచంద్ మానవవాదిగా తండ్రి ప్రభావంలో ఆరితేరి గూడవల్లి రామబ్రహ్మానికి సహాయపడి సంస్కరణ సినిమాలు తీయటంలో ఎంతో సహకరించారు. అనేక రచనలు రాజకీయ కథలు చేసి, ఎమ్.ఎన్. రాయ్ మానవవాద ఉద్యమంలో రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. తండ్రి మరణానంతరం క్రమేణా దిగజారిపోయి ఆధ్యాత్మిక రొంపిలో పడి అరవిందుణ్ణి సమర్థిస్తూ సాయిబాబా దాకా పతనావస్థకు చేరుకున్నాడు. కమ్మకుల వాడిగా ప్రారంభమై క్రమేణ పరిణమించి 1940 నాటికి భగవద్గీత రచన చేసి, కులాన్ని, మతాన్ని అధిగమించి మానవ వాదం వైపుకు పయనించారని రాశాను. పురాణం సుబ్రహ్మణ్యం శర్మ దీనిని 'ఉదయం' వారపత్రికలో ప్రధానంగా ప్రచురించారు. దీనిపై రియాక్ట్ అయినటువంటి వారిలో చేకూరి రామారావు వంటివారు ఉండటం గమనార్హం. అప్పుడు కూడా సమాధానం రాయండి వేస్తామని మాత్రమే ఎడిటర్లు చెప్పారు. భాషా పరిశోధకుడుగా పేరొందిన చేకూరి రామారావు, రియాక్షన్ కొందరిని ఆశ్చర్యపరిచింది.

**హోమియో**



రామచంద్రమూర్తి

హోమియో వైద్యం పై సునిశితమైన విమర్శతో పరిశోధనాంశాలతో రాసిన వ్యాసం పెద్ద సంచలనానికి దారి తీసింది. హోమియోపతి సైంటిఫిక్ కాదని, ఔనని రుజువు చేస్తే 5కోట్ల రూపాయలు పారితోషికం ఇవ్వడానికి హేతువాదుల సంఘం పక్షాన జేమ్స్ రాండీ ఫౌండేషన్ ప్రకటించిన విషయం ప్రస్తావించారు. కానీ ఎవరూ ముందుకు రాలేదు. కట్టుకథలతో బుకాయింపులతో హోమియో వైద్యులు తమ వ్యాపారాన్ని సాగించుకున్నారు. అనేకమంది యువకులు ఉపాధి నిమిత్తం హోమియో చదువులు స్వీకరించి, ఈ వ్యాసం తమను దెబ్బతీస్తున్నదని, తిరుగుబాటు చేశారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల ఊరేగింపులు జరిగాయి. కానీ, శాస్త్రీయమని రుజువు చేస్తూ ఏ ఒక్కరూ రాలేకపోయారు.

'ఉదయం'లో నా రచనలను సమర్ధించి, భావ స్వేచ్ఛకు, శాస్త్రీయ ధోరణికి మద్దత్తుగా రామచంద్రమూర్తి నిలిచారు.

**జి. రామిరెడ్డి అవినీతి బట్టబయలు**


పురాణం

ఆంధ్ర ప్రదేశ్ ఛీఫ్ జస్టిస్, సుప్రీంకోర్టు జడ్జి పింగళి జగన్మోహన రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా దారితప్పిన విద్యాలయాన్ని మళ్ళీ ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టాడు. కాపీ కొట్టటం పూర్తిగా ఆపగలిగారు. ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీలతో ఎవరూ దరఖాస్తులు పెట్టుకోనక్కరలేదని ప్రకటించిన అవమానకరమైన వ్యవస్థను మళ్ళీ సక్రమంగా ఉండేటట్లు సరిదిద్దారు. ఆయన హయాంలో పరిపాలనా విషయాలు పరిశీలించి, అవకతవకలు చేసిన వారిని మందలించారు. అందులో భాగంగా వైస్ ఛాన్సలర్ జి. రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఘోరాలపై ప్రొఫెసర్ వనజా అయ్యంగార్ ఏక సభ్య సంఘాన్ని వేశారు.


జగన్మోహన రెడ్డి

ఆవిడ పరిశీలించి, గుట్టు బట్టబయలు చేసింది.` నేను సేవ చేసిన యూనివర్సిటీ` అనే శీర్షికన జగన్మోహన రెడ్డి ఒక గ్రంథం రాశారు. వాటిలో ముఖ్యమైన అంశాలు నేను తెనిగించాను. అవి ‘ఉదయం’లో కొన్ని భాగాలుగా ప్రచురించారు. అప్పుడు వాటిని ప్రచురించడానికి ఎడిటోరియల్ సిబ్బందిలోనే కొందరు తటపటాయించారు. కానీ గజ్జెల మల్లారెడ్డి పట్టుబట్టి ప్రచురించారు. ఈ విధంగా ‘ఉదయం’లో నా రచనలు, అనువాదాలు గందరగోళాన్ని సంచలనాన్ని సృష్టించాయి. అందులో ఎడిటర్ ఎ.బి.కె ప్రసాద్ ధోరణి బయటపడింది. యజమానిగా పత్రికా స్వేచ్ఛ వైపు నిలచిన దాసరి నారాయణరావు అభినందనీయుడు.

(మరో తెలుగు పత్రిక గురించి వచ్చే సంచికలో)

COMMENTS

**Essay on Vivekananda**



